క్లుప్తంగా

చిన్నారులకు నిత్యావసర సరుకుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత రమ్య సహకారంతో మంగళవారం నిరుపేద చిన్నారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, కోరంగి నాగమల్లీశ్వరి మాట్లాడుతూ.. తాము నిరుపేద, అనాథ చిన్నారులను గుర్తించి ట్రస్ట్ సభ్యులు, దాత సహకారంతో నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. తమ వంతు బాధ్యతగా తాము అందిస్తున్న సేవలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. దాత రమ్య మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆకర్షించి, చిన్నారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెత్త తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డులో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తుఫాన్ వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా మురుగు కాలువల్లోని చెత్తచెదారం తొలగించారు. ఈ సందర్భంగా మేస్త్రి శ్రీనివాస్ మాట్లాడుతూ మురుగు కాలువలో చెత్తచెదారం వేయరాదని సూచించారు. చెత్తను ఇంటికి వచ్చిన పారిశుద్ధ్య సిబ్బందికే ఇవ్వాలని కోరారు. కాలనీల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు.

అనుమతి లేని ఫ్లోర్ కూల్చివేత



పటమట(విజయవాడతూర్పు): నగరపాల సంస్థ నుంచి అనుమతి లేకుండా పటమటలో అదనపు అంతస్తు వేయగా వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూల్చివేశారు. పటమటలోని కరణం బజారులో చెన్ను గంగాధరరావు వీఎంసీకి భవనంలో కొంతభాగాన్ని మార్టిగేజ్ చేయాల్సి ఉండగా చేయకుండా ఫ్లోర్ వేశారు. దీనిపై వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్ ఆదేశాలతో టీపీఎస్ వసీంబేగ్ సంబంధిత భవన యజమానికి నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ భవన నిర్మాణ అనుమతులకు సంబంధిత డాక్యుమెంట్‌ను యజమాని సమర్పించకపోవటంతో షాట్‌ఫాల్‌కి వెళ్లింది. దాన్ని సరిచేసుకోకపోవటంతో మంగళవారం వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ఆక్రమణల నిరోధ కార్మికులు భవన స్లాబును కూల్చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న భవనాలకు షాట్‌ఫాల్ ఉంటే వెంటనే వాటిని సరిచేసుకోవాలని లేనిపక్షంలో భవనాలను కూల్చేస్తామని చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్ హెచ్చరించారు.

మద్యం వ్యాపారుల జిమ్మిక్కులు

- తాము షాపు పెట్టిన చోట ఇతరులు షాపు పెట్టకుండా అడ్డుకునే ప్రయత్నాలు
- షాపులు పెట్టొద్దంటూ మహిళ సంఘాల పేరిట బ్యానర్ ఏర్పాటు
- తాము ఎలాంటి బ్యానర్ పెట్టలేదంటున్న మహిళా సంఘాలు
- దుకాణాలకు పేర్లు తప్ప కనబడని గెజిట్ నంబర్లు



సీతన్నపేటలో మద్యం దుకాణాలు



మహిళా సంఘాల పేరుతో ఏర్పాటు చేసిన బ్యానర్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): నగరంలో మద్యం వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఒకరు షాపు పెట్టిన చోట మరొకరు షాపు పెట్టకుండా అడ్డుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్య కూడళ్లలో మహిళా సంఘాల పేరుతో నకిలీ బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. 'దయచేసి ఈ ప్రాంతంలో మద్యం దుకాణం/ బార్ పెట్టకూడదని విన్నపము- మహిళా సంఘాలు'' అంటూ బ్యానర్లు వెలిశాయి. అయితే ఈ బ్యానర్లకు తమకు ఎటువంటి సంబంధం లేదని మహిళా సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఇదంతా ఇప్పటికే మద్యం షాపులు ఏర్పాటు చేసిన వారి పని తేల్చేశాయి. ప్రజా ప్రతినిధుల ప్రోద్బలంతో ఇప్పటికే షాపులు ఏర్పాటు చేసిన వారు ఈ తరహా బ్యానర్లు వేసి ఇతరులను బెదిరిస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో ఈ తరహా బ్యానర్లు వెలిశాయి.

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకువచ్చింది. నగరానికి 39 షాపులు కేటాయిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయడం, డ్రా నిర్వహించడం పూర్తయింది. లాటరీలో షాపులు దక్కించుకుని స్థానిక ప్రజా ప్రతినిధుల అండదండలు ఉన్న వారు ఈనెల 16న షాపులు ప్రారంభించారు. ఇక్కడే అసలు సమస్య ఉత్పన్నమైంది. ఈ దఫా మద్యం పాలసీలో కార్పొరేషన్ యూనిట్‌గా షాపులు కేటాయించింది. షాపులు దక్కించుకున్న వారు నగరంలో ఏ ప్రదేశంలోనైనా మద్యం షాపు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో షాపులు దక్కించుకున్న వారు కార్మికులు, కూలీలు, ఆటో, ముఠా వర్కర్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో షాపులు ఏర్పాటు చేసేందుకు ప్రదేశాలను ఎంపిక చేసుకుంటున్నారు. పైగా ఒకే ప్రదేశంలో ఎన్ని షాపులైనా పెట్టుకోవచ్చు. దీనికి ఎటువంటి షరతులు లేవు. ఏయే ప్రాంతాల్లో మద్యం విక్రయాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందో ఆ ప్రాంతాలపైనే వ్యాపారులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. అటువంటి కొన్ని ప్రాంతాలను సిండికేట్లు ఇప్పటికే వెతికి ప్రజాప్రతినిధుల అండతో షాపులు ఏర్పాటు చేశారు. ఇక ఆ ప్రదేశంలో ఇతరులెవ్వరూ షాపులు పెట్టకుండా అడ్డుకునేందుకు రకరకాల కుయుక్తులు పన్నుతున్నారు. రాజకీయ పలుకుబడి ఉపయోగిస్తున్నారు. కొందరు ఎక్సైజ్ శాఖలోని ఉన్నతాధికారుల ద్వారా షాపులు పెట్టనీయకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరు తాము షాపు ఏర్పాటు చేసిన చోటే మహిళ సంఘాలు ఏర్పాటు చేసినట్లుగా నకిలీ బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంకొందరు కాలనీ వాసుల పేరుతో మహిళలను రంగంలోకి దింది నిరసనలకు సిద్ధమవుతున్నారు.

బీఆర్టీఎస్ రోడ్డులో వెలిసిన బ్యానర్..

బీఆర్టీఎస్ రోడ్డులో సీతన్నపేట గేటు ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఈనెల 16న రాజశ్రీ వైన్స్ పేరుతో మద్యం దుకాణం ప్రారంభించారు. దానికి ఎదురుగానే త్వరలో అమరావతి వైన్స్ ప్రారంభం అంటూ దుకాణానికి ఓ బ్యానర్ ఏర్పాటు చేశారు. సరిగ్గా ఇక్కడే... మహిళా సంఘాలు ఏర్పాటు చేసినట్లుగా ఓ బ్యానర్ వెలిసింది. బీఆర్టీఎస్ రోడ్డుకు ఆనుకుని అది కూడా సిగ్నల్‌కు కేవలం 10 మీటర్ల దూరంలో మద్యం షాపు ఏర్పాటు చేశారు. ఇక్కడ ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. మద్యం షాపు మెట్లు పూర్తిగా రోడ్డుపైకే ఉన్నాయి. నిబంధనల ప్రకారం షాపుల నిర్వాహకులు గెజిట్ నంబర్‌ను సైన్ బోర్డుపై తప్పనిసరిగా వేయాలి. ఇక్కడ అటువంటి నంబర్ ఏదీ లేదు. ఈ ఒక్క చోటే కాదు సెంట్రల్‌లో 11 షాపులు ఏర్పాటు చేస్తే వాటికి రకరకాల పేర్లు పెట్టారు తప్ప గెజిట్ నంబర్లు ముద్రించలేదు. దీంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆ బ్యానర్‌కు మాకు సంబంధం లేదు..



మేం ఎక్కడా బ్యానర్ ఏర్పాటు చేయలేదు. బీఆర్టీఎస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బ్యానర్‌కు మాకు సంబంధం లేదు. ఇదంతా మద్యం షాపులు ఏర్పాటు చేసుకున్న వారు ఇతరులు షాపులు ఏర్పాటు చేయకుండా చేసే ప్రయత్నాల్లో భాగమే అయి ఉండొచ్చు. మేం ఒక్కటే డిమాండ్ చేస్తున్నాం. నిబంధనల ప్రకారం బడి, గుడి, బస్టాప్ వంటి వాటికి దూరంగా దుకాణాలు ఏర్పాటు చేయాలి. డ్రై డేస్ పాటించాలి. నిబంధనలు పాటించకపోతే ఆందోళన చేస్తాం.

– పి.దుర్గాభవాని, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ

బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలి



పటమట(విజయవాడతూర్పు): ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి కూడా ఆర్థిక నేరాలు జరుగుతున్నాయని దీనిపై బ్యాంకర్లు కూడా అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ సూచించారు. పటమట పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని 30 మంది బ్యాంకర్లతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ఆర్థిక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో బ్యాంకర్లు కూడా ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంటుందన్నారు. ఓటీపీలు, లింక్‌లు వంటివి క్లిక్ చేయటం వల్ల ఆర్థిక నష్టం ఏర్పడుతుందని, దీనిపై బ్యాంకుల్లో కూడా ప్రజలకు చైతన్యం కలిగించేలా పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. డిపాజిటర్లు ఎక్కువ మొత్తంలో నగదును డ్రా చేయటం, డిపాజిట్ చేయటం వంటివి జరిగితే పరిశీలన జరగాలని, వృద్ధులు, వికలాంగులు నగదు డ్రా చేసే సమయంలో వారికూడా ఎవరినైనా వెంట తెచ్చుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల్లో, బ్యాంకుల బయట 360 డిగ్రీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వాటి నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పటమట సీఐ పవన్‌కిషోర్, గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొద్దిపాటి వర్షానికే తటాకాలుగా రోడ్లు



న్యూ ఆర్‌ఆర్‌పేట రోడ్డులో వర్షం నీటిలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు



నందమూరినగర్ సాయిబాబా గుడి వద్ద వర్షపు నీటిని లాగుతున్న స్థానికుడు



నూకాలమ్మ గుడి వద్ద ఆగిన నీటిని పారేలా చేస్తున్న కార్మికుడు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపును మళ్లీ కలలో కూడా ఊహించకూడదని సింగ్‌నగర్ పరిసర ప్రాంత ప్రజలు అనుకుంటుంటే.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ సంఘటనలు ఇక్కడి ప్రజల కళ్లముందు కనిపిస్తూనే ఉన్నాయి. ఇక్కడి సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని డ్రెయిన్లలో పూడికలను సరిగా తీయకపోవడంతో కాలువలు సరిగా పారడం లేదు. దీంతో కొద్దిపాటి చినుకులు పడినా అవి వెళ్లే దారి లేకపోవడంతో ఆ నీరంతా రోడ్లపైకి మోకాళ్ల లోతులోకి చేరి స్థానిక ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం కురిసిన కొద్దిపాటి వర్షానికి సింగ్‌నగర్ – నూజివీడు ప్రధాన రహదారి, సింగ్‌నగర్ – న్యూఆర్‌ఆర్‌పేట రోడ్డు, ఆర్‌యూబీ మార్గాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సివచ్చింది. రోడ్లపై, ఇళ్ల ముందు వర్షపునీరు నిలుస్తుంటే తమకు చాలా భయంగా ఉంటుందని.. ప్రభుత్వం వర్షపునీరు నిలవకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

సెమీ కండక్టర్ విభాగంలో అద్భుత ప్రగతి



సర్టిఫికెట్ అందజేస్తున్న చలవాది మల్లికార్జునరావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సెమీ కండక్టర్ రంగంలో దేశం అద్భుత ప్రగతిని సాధించిందని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు పేర్కొన్నారు. కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ ఫర్ టెక్స్టబులిటీ అండ్ ఫిజికల్ డిజైన్ అంశంపై నిర్వహించిన ఐదు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మల్లికార్జునరావు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక ఫలితాలు సామాన్యులకు చేరేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. ఆయా రంగాల్లో చోటు చేసుకున్న ప్రగతిని విద్యార్థులకు తెలిపేందుకు ఈ విధమైన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు పొట్టి సురేంద్రకుమార్, కోశాధికారి కె.రాఘవయ్య, రిసోర్స్ పర్సన్లు డాక్టర్ షేక్ అష్రఫలీ, ఉపేంద్రరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, హెచ్‌ఓడీ ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై సంగీత విభావరి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించిన సంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం విజయవాడ కేదారశెట్టి అనూష బృందం సంగీత విభావరి ప్రదర్శించింది. తొలుత దేవస్థానం ఆస్థాన మేళ బృందం డోలు, సన్నాయిలపై అమ్మవారి కీర్తనలను ఆలపించి భక్తులను రంజింపజేసింది. అనంతరం కళాకారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట సబ్‌స్టేషన్ 11 కేవీ సీతారామపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాంధ్ర ప్రెస్, విశాలాంధ్ర ప్రెస్ రోడ్, బోయపాటి వారి వీధి, శ్రీనివాసరావు వీధి, నేతాజీ వీధి, బారిస్టర్ వారి వీధి, బంకపల్లి వారి వీధి, పాపయ్య వీధి, స్వాతి ప్రెస్ ఏరియా, కడియాల వారి వీధి, బెల్లపు శోభనాద్రి వీధి, చలసాని వెంకట కృష్ణయ్య వీధి, కోవెలమూడి వారి వీధి, ఎంజే నాయుడు హాస్పిటల్ ఏరియా, దాసరి వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపు దేశ్ కా ట్రక్కు ఉత్సవ్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): దేశంలో అతి పెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ ఈ నెల 24న విజయవాడలో దేశ్ కా ట్రక్కు ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కమర్షియల్ వెహికల్స్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ కౌల్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రక్కింగ్ కమ్యూనిటీని వారికి పనికొచ్చే సూచనలతో బలోపేతం చేయడానికి రూపొందించినట్లు పేర్కొన్నారు. చక్కటి వివరణలతో కూడిన వాహన ప్రదర్శనలు, టాటా మోటార్స్ సమగ్ర విక్రయానంతర సేవల మద్దతుపై వివరణలు ఉంటాయని వివరించారు. కస్టమర్ల అవసరాలను అర్థం చేసుకుని, పరిష్కరించేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు.

కారు ఢీ కొని గేదె మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): గొల్లపూడి – ఆవుటపల్లి జాతీయ బైపాస్ రోడ్డులో పాతపాడు గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీ కొని గేదె మృతి చెందింది. నున్న పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు పాతపాడు గ్రామం వద్ద గేదెను ఢీ కొనగా గేదె అక్కడికక్కడే చనిపోయింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ ముదునూరి రమేష్‌కు స్వల్ప గాయాలు కాగా చికిత్సకు ఆస్పత్రిలో చేర్చారు. పాతపాడు గ్రామ మహిళ సంరక్షణ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల కళాశాలలో యూత్ ఫెస్టివల్



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో మంగళవారం యూత్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని ప్రభుత్వ సేవలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురుషులతో సమానంగా రాణించాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథి సిద్ధార్థ మహిళా కళాశాల సంచాలకులు డాక్టర్ టి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థినులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ.. విద్యార్థినులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం బీకాం, బీఎస్సీ కోర్సులలో ప్రథమ స్థానం సాధించిన నాగమణి, బేబీ, రేవతిలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే ఇటీవల నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలతో సత్కరించారు. తొలుత విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించండి

సీడీఎంఏ ఉత్తర్వులు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో ప్రజారోగ్యం, కంప్యూటర్ ఆపరేటర్‌గా, ఉద్యాన విభాగల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని వీఎంసీ కమిషనర్‌ను సీడీఎంఏ (కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) ఆదేశించింది. కనీస వేతనాలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వీఎంసీలో పారిశుద్ధ్యం నిర్వహణకు ఔట్ సోర్సింగ్‌లో 2000 మంది, ఉద్యాన విభాగంలో 65 మంది కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లుగా 28 మంది విధులు నిర్వహిస్తున్నారు. వారికి కనీస వేతనం చెల్లించటం లేదని మునిసిపల్ యూనియన్ నాయకుడు ఆసుల రంగనాయకులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ ఏడాది మేలో హైకోర్టు కార్మికులు సమాన వేతనాన్ని చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ వీఎంసీ కమిషనర్ పెడచెవిన పెట్టడంతో పిటిషనర్ కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద మళ్లీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రాష్ట్ర మున్సిపల్ శాఖ స్పందించి వెంటనే కార్మికులకు కనీస వేతనాలను చెల్లించాలని సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆలయాల పేరుతో కొనసాగుతున్న ఆక్రమణలు



మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో నిర్మిస్తున్న ఆలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఇక్కడ దసరా ఉత్సవాల పేరిట ఒక ఆలయాన్ని నిర్మించారు. దీనిపై సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురించటంతో స్పందించిన అధికారులు ఆలయాన్ని తొలగించటానికి జేసీబీతో సహా వచ్చారు. అయితే నిర్వాహకులు తమకు కొంత సమయం ఇవ్వాలని తామే ఆలయాన్ని తొలగిస్తామంటూ కోరారు. దీంతో అధికారులు రెండు రోజుల సమయం ఇచ్చి రాతపూర్వకంగా లెటర్ తీసుకున్నారు. అయితే మూడు రోజులు గడిచినప్పటికీ ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. ఇది ఇలా ఉండగా ఇక్కడకు అత్యంత సమీపంలో అమ్మవారు వెలిశారంటూ మరో ఆక్రమణకు తెర తీశారు. అమ్మవారు వెలిశారని చెబుతున్న ప్రాంతంలో పందిరి వేసి ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. సమాచారం అందుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇరిగేషన్ సిబ్బందితో కలిసి ఆలయ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నిర్మాణం చేసిన దిమ్మలను తొలగించాలని అధికారులు కోరారు. ఇక్కడ అమ్మవారు వెలిశారని తమకు కొంత సమయం కావాలంటూ నిర్వాహకులు కోరారు. దీంతో అధికారులు రెండు రోజుల సమయం ఇచ్చి నిర్మాణాలు తొలగించాలని లేని పక్షంలో తాము చర్యలు తీసుకుంటామంటూ చెప్పి వెళ్లిపోయారు. ఈ ఆక్రమణలకు అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని అందుకే సమయం పేరిట జాప్యం చేసి అధికారులపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.





అలరించిన డ్రోన్ షో







భవానీపురం వద్ద కృష్ణానదీ తీరాన మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రోన్ షో అలరించింది. 5,500 డ్రోన్లతో ఈ షో కొనసాగింది. ఆకాశంలో సుమారు 15 నిమిషాల పాటు డ్రోన్‌లు సృష్టించిన పలు ఆకృతులు కనువిందు చేశాయి. తొలుత ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. జుగల్ బందీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డ్రోన్ షో కారణంగా జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)

- **సర్టిఫికెట్ల ప్రదానం**

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో చదువుతూ 2023–24 విద్యా సంవత్సరంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొంది క్యాంప్‌నకు హాజరైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ సోపాన సర్టిఫికెట్లను మంగళవారం ప్రదానం చేశారు. సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు, ఉపాధ్యాయులు అభినందించారు.